## వ్యాసం

# 'మార్క్సిస్టు వాస్తవికత' – మరికొన్ని అభిప్రాయాలు

— కె. బాలగోపాల్

రావిపూడి వెంకటాద్రి మార్క్సిజానికి ఇచ్చిన వ్యాఖ్యానానికీ చేసిన విమర్శకూ త్రిపురనేని మధుసూదనరావు చెప్పిన సమాధానానికి (అరుణతార, ఫిబ్రవరి 1982) ఈ వ్యాసం అనుబంధం మధుసూదనరావుగారు చెప్పకుండా వదిలేసిన రెండుమూడు ముఖ్య అంశాలను మాత్రం ప్రస్తావిస్తాను. నిజానికి వెంకటాద్రి పుస్తకాన్ని పంక్తి పంక్తీ విమర్శించవచ్చు కాని అది అపాత్రగౌరవం అవుతుంది.

i

మొదటిది, మార్క్సిజంలో మార్క్స్ 'సొంతం' ఎంత, అరువుతెచ్చుకున్నదెంత అన్న ప్రశ్న. దీనికి వెంకటాద్రి సమాధానం చాలా స్పష్టమయింది. మార్క్సిజంలో వున్న అన్ని విషయాలూ, హెగెల్‌నుండి ప్రౌధన్ వరకు, ప్రౌధన్‌నుండి ఆడంస్మిత్ వరకు, ఎంతో మంది మేధావులు చెప్పినవే. మార్క్స్ సొంతమల్లా వాటిని కలిపి "కషాయం" చేయడం మాత్రమే. ఆ కషాయం సోవియట్ రష్యావారి పోషణ పుణ్యాన మార్క్స్ సొంత సరుకుగా చలామణి అవుతూండగా, పాపం హెగెల్‌ను ప్రౌధన్‌ను ఆ రకంగా దత్తతతీసుకున్న వారెవ్వరూ లేకపోబట్టి మార్క్సిజం నిజంగా వాళ్ళ సరుకేనన్న విషయం ప్రజలకు తెలీడం లేదు.

దీనికి రెండు మూడు స్థాయిల్లో సమాధానం చెప్పవచ్చు. ఒకటి "మార్క్సిజం" అన్నమాట 'గతితార్కిక భౌతికవాదం' అన్న మాటకు పర్యాయపదం మాత్రమే. దాన్ని 'కనిపెట్టింది' మార్క్సేనా అన్న ప్రశ్న ఏ మార్క్సిస్టునూ బాధించదు. రెండు, ఎవరి ఆలోచనలూ పూర్తిగా తమ 'స్వంతం' కావు. ఆలోచన

లకు పునాది సమాజం అయినప్పుడు, ఒక భౌతిక వాస్తవానికి అనుగుణమయిన భావాలు అనాటి బౌద్ధిక వాతావరణంలో వుంటాయి. అంటే ఎంతోమంది ఆలోచనల్లో స్పష్టాస్పష్ట రూపంలో వుంటాయి. ఇది మార్క్సుకేకాదు, న్యూటన్‌కూ వర్తిస్తుంది, ఐన్‌స్టీన్‌కూ వర్తిస్తుంది. న్యూటన్ చెప్పినవేవీ గూడా పూర్తిగా అతని 'స్వంతం' కాదు. కొన్ని విషయాలలో రాబర్టు హూక్, కొన్ని విషయాలలో లీబ్నిజ్, న్యూటన్ చేసిన తీర్మానాలకు, గణితశాస్త్ర నిర్మాణానికి, సన్నిహితంగా వచ్చారు. వారిద్దరితోను న్యూటన్ 'నేనుముందా నువ్వుముందా' అని తగువు గూడా పెట్టుకున్నాడు. ఐన్‌స్టీన్ గూడా అంతే. ఐన్‌స్టీన్ చెప్పిన చాలా విషయాలు మైకెల్‌సన్-మార్లే ప్రయోగం నాటి నుండి ఆకాలపు అగ్రగామి శాస్త్రజ్ఞుల ఆలోచనల్లో వున్నవే. ఏది ఎవరి 'స్వంతం' అన్న విషయాన్ని గూర్చి ఐన్‌స్టీన్ ఎవ్వరితోను - న్యూటన్‌లాగ - తగువు పడకపోవడానికి కారణం ఆయన ఉన్నత వ్యక్తిత్వం మాత్రమే. మరయితే వీళ్ళిద్దరినీ గొప్ప శాస్త్రజ్ఞులుగా పొగడ్డం తప్పా అంటే కాదు. ఎందుకంటే, ఆనాటి విజ్ఞానశాస్త్ర పరిణతిని అనుసరించి కొన్ని వాస్తవ శకలాలను (Bits of reality) వివరించే విడివిడి సూత్రీకరణలు చేయడం ఒక ఎత్తు, వాటినన్నింటినీ ఒక్కగాటనకట్టే సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం వేరొక ఎత్తు. అదే 'జీనియస్' అనబడేవాడు చేసేపని. న్యూటన్ చలన సూత్రాలు ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం, ఈ కోవకు చెందినవి. తమ సమకాలికులయిన శాస్త్రజ్ఞుల దృష్టికి వచ్చిన ఎన్నో విడి విడి విషయాలను ఒక్క సిద్ధాంతపు గాటనకట్టడం వీళ్ళిద్దరూ చేసినపని. అదొక గుణాత్మకమయిన పరిణామం.

మార్క్స్ చేసిందీ ఇదే. నిజానికి మార్క్సుకు సిద్ధాంత ఋణదాతలుగా వెంకటాద్రి పేర్కొన్న జనాభాలిస్టు చాలా ఆశ్చర్యకరయినది. అందులో హెగెల్‌కు ఉన్న ప్రాముఖ్యం వేరెవ్వరికీ లేదు, ప్రౌధన్‌కున్న స్థానం ఆడం స్మిత్‌కూ రికార్డోకూ లేదు (వీళ్ళిద్దరి పేర్లు ఒక్క వాక్యంలో మాత్రమే కనిపిస్తాయి.) కాని మార్క్స్ రచనలతో పరిచయం ఉన్న వాళ్లెవరికయినా మార్క్సుకు ప్రౌధన్ అంటే విపరీతమయిన వేళాకోళమనీ, హెగెల్‌పట్ల ఒక తెలివయిన స్కూలు కుర్రవాడి పట్ల టీచర్‌కుండే వాత్సల్యమేగాని పెద్దగా గౌరవంలేదని, ఆడంస్మిత్ రికార్డోలనే మార్క్స్ మనస్పూర్తిగా గౌరవించాడనీ తెలుస్తుంది. మార్క్స్ ప్రౌధన్‌ను హేళనచేయకుండా ప్రస్తావించిన సందర్భంలేదు. హెగెల్‌ను గూడ ఒక విసురు లేకుండా ఎన్నడూ కోట్ చేయలేదు. తనకు రాజకీయార్థికశాస్త్రం

నేర్పిన ఆడంస్మిత్ రికార్డోలను మాత్రమే చాలా సందర్భాలలో సాదరంగా వుంట
కించాడు, నాకు కలిగే అనుమానమేమిటంటే అసలు వెంకటాద్రిగారు మార్క్స్
రచనలు చదివారా లేక యం. యన్. రాయ్‌నీ, కార్ల్ పాప్పర్‌నీ, పిట్రిం సోరోకిన్‌నీ
చదివి సరిపెట్టుకున్నారా అని.

అదలా వుంచుదాం. మార్క్స్ 'సొంత' సరుకు మాటకొస్తే, అసల
మార్క్స్ ప్రౌధన్‌కుగాని, ఫొరియర్‌కుగాని, రుణపడింది ఏమీలేదు. ప్రౌధన్
**'Property is theft'** [ఆస్తి అనేది చోరీ] అన్నప్పుడు వ్యక్తపరచిన నైతిక
ఆవేదనగాని, ఫొరియర్ కమ్యూనిజాన్ని వివరిస్తూ **'from each accordin**
**to his work and to each according to his need'** [ఎవరిపని బట్టి
వారికీ, ఎవరి అక్కరబట్టివారికీ) అనడంలో గలఆదర్శవాదంగాని.మార్క్స్‌కు పెద్దగ
రుచించేవికావు [ఫొరియర్ చెప్పిన ఈ మాటలకు వెంకటాద్రి ఇచ్చిన వింత అను
వాదం : 'చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత నుండి కావలసిన వాళ్ళకు కావలసి
నంత వరకు' వెంకటాద్రికి మార్క్సిజం అర్థం కాకపోతే మానె, ఇంగ్లీష్ గూడ
రాదా. లేకపోతే, 'చేసుకున్న వాళ్ళకుచేసుకున్నంత' అనడంలో ఈబూర్జువా మేధా
ఫ్యూడల్ లక్షణాలను ప్రదర్శిస్తున్నాడా ?) ఆదర్శవంతమయిన సమాజం ఏ
విధంగా వుండాలో ఊహించడంలో వాళ్ళు కాలంగడిపారు. నేటి సమాజం భౌతి
స్వరూపం ఏమిటో, దాన్ని ముందుకు నడిపే వైరుధ్యాలేవో, అవి దాన్ని ఎట
తీసుకుపోతాయో, విశ్లేషించడం మార్క్స్ తన బాధ్యతగా ఎంచుకున్నాడు
హెగెల్‌కు, ఆడంస్మిత్ రికార్డోలకు, మార్క్స్ చాలా రుణపడివున్న మాట
వాస్తవం. బ్రిటిష్ చరిత్రకారుడు ఇ. హెచ్. కార్ (E.H. carr) అన్నట్లుగా
మార్క్స్ హెగెల్, ఆడంస్మిత్‌ల శిష్యుడు. అయితే వాళ్ళ ఆలోచనల్లో వాళ్ళు
పాక్షికంగా గుర్తించిన సత్యాలకు వాళ్ళ వర్గస్వభావం వల్ల ఏర్పడ్డ పరిమితిని తొల
గించి, పరిపూర్ణతనిచ్చి, మార్క్సిస్టు దృక్పథాన్ని — ఒక సమగ్ర ప్రాపంచి
దృకథంగా, కార్మిక వర్గ దృక్పథంగా - తాను ప్రతిపాదించాడు. అంటే గురుత్వా
కర్షణ సిద్ధాంతం ఏ అర్థంలో న్యూటన్ 'స్వంత'మో సరిగ్గా అదే అర్థంలో
మార్క్సిజం మార్క్స్ 'స్వంతం'.

తన గురువులిద్దరినీ మార్క్స్ ఏ విధంగా సంస్కరించాడో తెలుసు
కోవడం అవసరం. హెగెల్ గతితర్కం భావవాదాన్ని ఆశ్రయించింది. హెగెల్
గతితార్కిక సూత్రాలను, వస్తుగత ప్రపంచపు చలన సూత్రాలుగా కాక, మనుష్య

ఆలోచన తాలూకు ధర్మాలుగా ప్రతిపాదించాడు. దీనితో వచ్చిన చిక్కేమిటంటే ఏ వైరుధ్యాలు వాస్తవికమయినవో ఏవికావో, వాస్తవికమయిన వాటిలో ఏవి అప్రధానమో నిర్ణయించే వస్తుగత ప్రమాణం వుండదు. కాబట్టి ఎవరి చాపల్యాన్ని వారు అనుసరించి ఏవో రెండు పరస్పర విరుద్ధ అంశాలమధ్య వున్న గతితార్కిక చర్యను ఆధారం చేసుకొని చరిత్రను వ్యాఖ్యానించవచ్చు ఇప్పటికీ చేస్తున్నారు గూడ. ఎమర్జెన్సీఘటనను, ఇందిరాగాంధీ రాజకీయ చతురతకు, ఆమెకు తన చిన్న కుమారుడి పట్ల వున్న గుడ్డివాత్సల్యానికీ మధ్య వున్న 'వైరుధ్యాన్ని' ఆధారం చేసుకొని వ్యాఖ్యానించిన ఊకదంపుడు రాజకీయ భాష్యకారులను ఎందరిని చూడ లేదు ? హెగెల్ విజ్ఞత ఆయనను ఇటువంటి చవుకబారు 'గతితర్కం' నుండి రక్షించిందిగాని, ఆయన అనుచరులు చాలా మంది మార్క్స్ కాలానికే గతి తర్కాన్నిగాలికసరత్తుకిందికిదిగజార్చారనిఎంగిల్స్అన్నాడు. మార్క్స్ఇక్కడకలగ జేసుకొనిహెగెల్ గతితర్కానికిభౌతికవాద దృక్పథాన్నిజతచేసి;ఏ వైరుధ్యాలువాస్తవి కమో ఏవికావో, ఏవి ప్రధానమో ఏవి అప్రధానమో నిర్ణయించగల భౌతిక ప్రమాణాన్ని ఏర్పరచి గతితర్కాన్ని శాస్త్రీయం (అంటే ప్రమాణబద్ధం) చేసాడు. ఇది కేవలం గతితర్కాన్ని అరువుతీసుకోవడంకాదు, గుణాత్మకమయిన మార్పు.

ఆడం స్మిత్, రికార్డోల విషయంలో మార్క్స్ సృజనాత్మకత మరింత స్పష్టంగా కనిపిస్తుంది. విలువ, ఆదనపు విలువ సిద్ధాంతాలు మార్క్సిజానికి చాలా కీలకమయినవి. వీటిలో మొదటిది మార్క్స్ రికార్డో నుండి 'అరువు' తెచ్చు కున్నది. దానికి రెండవ దాన్ని చేర్చడం వలన పరిపూర్ణత నివ్వడమే కాకుండ, మొత్తం పెట్టుబడిదారీ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమయిన కీల కాన్ని కనుగొన్నాడు. రికార్డో గుర్తించింది. ఒక వాస్తవ శకలమే అయితే దాన్ని పూరించి సమగ్రమయిన సిద్ధాంతం చేసింది మార్క్స్.

విలువకు మూలం శ్రమ అనీ, ఒక వ్యాపార సరుకు విలువ దాన్ని ఉత్పత్తిచేయడానికి అవసరమయిన శ్రమకు అనులోమంగా (proportionate) వుంటుందని, రికార్డోగుర్తించాడు. చాలా ముఖ్యమయిన విషయమే గాని, పెట్టుబడి దారీ సమాజానికి చోదకశక్తి అయిన 'లాభాన్ని' ఇది వివరించలేక పోయింది. దాన్ని వివరించడానికి మార్క్స్, రికార్డో విలువ సిద్ధాంతాన్ని పూరించే అదనపు విలువ సిద్ధాంతాన్ని చేసాడు. పెట్టుబడిదారు బజార్లో అన్ని ముడిసరుకులతో బాటే శ్రమశక్తిని గూడా కొంటాడు. ఈ శ్రమశక్తిచేత శ్రమచేయిస్తాడు. శ్రమచేసే

క్రమంలో శ్రమశక్తి విలువను ఉత్పత్తి చేస్తుంది. ముడిసరుకుల విలువ పది రూపాయలయితే మరొక అయిదురూపాయల విలువను అదనంగా ఉత్పత్తిచేసి పదిహేను రూపాయల సరుకును తయారుచేస్తుంది. ఈ రకంగా ఉత్పత్తి అయిన అయిదు రూపాయల విలువ తన (అంటే శ్రమశక్తి) విలువ (మూడు రూపాయలనుకుందాం) కంటే ఎక్కువ. ఆ మిగిలిన రెండురూపాయలే అదనపు విలువ. దానికోసమే పెట్టుబడిదారీ ఉత్పత్తి జరుగుతుంది. అదే పెట్టుబడిదారుకు ప్రాణం, దైవం, మోక్షం, అన్నీను. రికార్డోకు అంతుచిక్కని ఈ సిద్ధాంతాన్ని చేయడం ద్వారా మార్క్స్ పెట్టుబడిదారీ సమాజపు రహస్యాన్ని కనుగొన్నాడు. ఈ అదనపు విలువవేట ఏ విధంగా అతి ఉత్పత్తికీ (over - production), సంక్షోభానికీ, దారితీస్తుందో, ఏ రకంగా అనివార్యంగా గుత్తపెట్టుబడిదారీ విధానానికి దారి తీస్తుందో, చూపించాడు అవి రెండూ ఇవ్వాళ పెట్టుబడిదారీ సమాజపు నిత్యవాస్తవాలయ్యాయి.

## II

రెండవది, చారిత్రక నియతికీ, స్వేచ్ఛకూ. చరిత్ర గతిని నిర్ణయించడంలో భావవికాసానికీ మానవ సంకల్పానికీ వున్న స్థానానికీ, సంబంధించింది. ఇక్కడ గూడ వెంకటాద్రి అభిప్రాయం స్పష్టంగా వుంది. చారిత్రక నియతి అనేది లేదు. చరిత్రకు సంకల్పం లేదు. మనిషికే సంకల్పం వుంది. ఈ సంకల్పమే చరిత్రకు చోదక శక్తి. భావవికాసమే చరిత్రను నడుపుతుంది. మనిషిని కొలవడానికి వ్యవస్థలు ప్రమాణంకారాదు, వ్యవస్థల్ని కొలవడానికి మనుషులు ప్రమాణం కావాలి

అన్నింటికీ మనిషే ప్రమాణం అంటే వినడానికి బాగుంది గాని, ఏ మనిషి ప్రమాణం ? వెంకటాద్రి ప్రమాణమా లేక ఋగ్వేదకాలం నాటి పశుపోషకులయిన ఆర్యగణాలలోని మనుషులు ప్రమాణమా ? వెంకటాద్రి మాట ఏమోగాని ఆయన పక్కింటి వాళ్ళు పొరుగింటి వాళ్ళు స్కూటర్ కావాలనీ, టేప్ రికార్డర్ కావాలనీ, కొంచెం ఆశ మీరితే 'ఫ్రిజ్' కావాలనీ తమ ఇష్టదైవాలను ప్రార్థిస్తారు; అదే వేదకాలపు ఆర్యులు ఇంద్రుడినీ వరుణుడినీ కనబడ్డ ప్రతీ దేవుడినీ తమకు పుష్కలంగా గోవులిమ్మని వేడుకున్నారు. ఈ రెండు కోర్కెలలో ఏది ప్రామాణి

కం ? ప్రభుత్వాన్ని ఫ్యాక్టర్లు తయారు చేయమని డిమాండ్ చేద్దామా, దేశాన్ని 'డైరీ ఫారం' గా మార్చమందామా ? వెంకటాద్రి నిత్యాసలవరింత 'స్వేచ్ఛ' గురించి. అదే పోతనకూ తులసీదాస్‌కూ 'స్వేచ్ఛ' అంటే ఏమిటో గూడ తెలియదు వాళ్ళు కోరుకున్నది మోక్షం. మరి స్వేచ్ఛ ప్రామాణికమా, మోక్షం ప్రామాణికమా ? చరిత్రకు మనిషే ప్రమాణం ... వాస్తవమే, కాని ఏ మనిషి ? ఆచరిత్రే రూపొందించిన మనిషి. మనిషే చరిత్రను రూపొందిస్తాడన్నా తప్పుకాదు. చరిత్ర మనిషిని రూపొందిస్తుందన్నా తప్పు కాదు. ఒక దశకు చేరుకున్న చరిత్రకు ఒక వాస్తవ స్వరూపం స్వభావం ఉంటాయి. ఆ సమాజంలో పుట్టిన మనిషి ఆ స్వభావాన్ని అనుసరించి దాన్ని పై దశకు తీసుకపోతూ, తన్నుతాను ఆ పై దశకు అనుగుణంగా మార్చుకుంటాడు. ఆ (మారుతున్న) మనిషి ఆ (మారుతున్న) చారిత్రక దశకు ప్రమాణం. గతితర్కం అర్థం కాని వెంకటాద్రికి ఇది 'గిలగిల తన్నుకోవడం' గా కనిపించవచ్చుగాని (వెంకటాద్రి పుస్తకం చదివిన వాళ్ళకు ఎంగెల్స్‌కు మూర్ఛరోగం వుండేదేమోనన్న అనుమానం రాక మానదు), కొంత చరిత్రజ్ఞానం వున్న వాళ్ళకు అంతుచిక్కని విషయం కాదు. ఆలోచనకు చరిత్రలో ప్రాధాన్యత లేదని మార్క్సిజం ఎన్నడూ అనలేదు. చరిత్ర గమనానికి అత్యంత ముఖ్యమయిన ఆలోచన ఆ చరిత్ర గమనం నుండే పుట్టి దాని చలన సూత్రాలననుసరించి దాన్ని ముందుకు తీసుకు పోవడానికి దోహదం చేస్తుందని మాత్రమే మార్క్సిజం అనింది. లౌకికత ప్రధానమయిన బూర్జువా దృక్పథం వెంకటాద్రికి ఐహిక స్వేచ్ఛమీద మమకారం కలిగించింది. పార లౌకికత ప్రధానమయిన ఫ్యూడల్ భావజాలం పోతనకు మోక్షం వైపు దృష్టి మళ్ళించింది 'వ్యవస్థలన్నీ మారతాయిగాని, తనకు తాను ప్రమాణంగా మనిషి మారడు' అనేది అర్థంలేని మాట. 'తనకు తాను' శాశ్వత ప్రమాణమయిన 'మనిషి' ఎక్కడా లేడు. చరిత్రలోకి పోనక్కర లేదు. ఇవ్వాళ్టి సమాజంలోనే, వెంకటాద్రి వంటి మధ్యతరగతి మేధావులకూ, సారా కాంట్రాక్టర్ల గూండాలకు, పొలందున్నే వ్యవసాయకూలీకి, తినడం నిద్రపోవడం వినా ఏ సామాన్య లక్షణాలున్నాయని వాళ్ళందరిలోను ఒకే ప్రామాణికమయిన నైరూప్య (అబ్‌స్ట్రాక్ట్) 'మనిషి' ని చూడడం ? చివరికి వాళ్ళు తినే తిండీ ఒక రకమయింది కాదు, తీసే నిద్రా ఒక రకమయింది కాదు. సారాకాంట్రాక్టరు గూండాలు 'ఫూటుగా' తాగి నిద్రపోతారు: వ్యవసాయకూలీ అర్ధాకలితో కలత నిద్రపోతాడు; వెంకటాద్రి

'స్వేచ్ఛ'ను గురించి కలలు గంటాడు. వీళ్ళలో ఎవరు ప్రమాణం, ఏది ప్రామాణికం ?

ఇంతకంటె ముఖ్యమయింది, భావవికాసమే చరిత్ర చోదక శక్తి అనే సిద్ధాంతం. 'భావాల వల్ల ఉత్పత్తి విధానాలు మారాయిగాని ఉత్పత్తి విధానాల వల్ల భావాలు జనించరంలేదు'. మరొక చోట 'నిజానికి విజ్ఞానశాస్త్రజ్ఞులు చేసినవే నిజమయిన విప్లవాలు'. ఇదే వాస్తవ మయితే వెంకటాద్రి ఒక విషయాన్ని వివరించాల్సి వుంటుంది. పాశ్చాత్య దేశాలలో ప్రాచీనకాలపు చివరి వైజ్ఞానికుడు టాలెమీ (ptolemy). ఇతను క్రీ. శ. రెండవ శతాబ్దంలో చనిపోయాడు. ఇతని తరువాత దాదాపు 15 శతాబ్దాలపాటు విజ్ఞానవికాసం స్తంభించింది. ఆ తరువాత ఒక్క ఊపులో (17వ శతాబ్దపు మధ్యభాగంలో మొదలయి) న్యూటన్, హూక్, కెప్లర్, లీబ్నిజ్, గలిలియో, ... ఇంకా అసంఖ్యాకులయిన శాస్త్రజ్ఞులెందరో పట్టుకొచ్చారు. అమాంతంగా ఇంతమంది శాస్త్రజ్ఞులు ఒకటి రెండు శతాబ్దాల వ్యవధిలో ఎందుకు పుట్టుకొచ్చారు ? వెంకటాద్రి చెప్పే భావవికాసానికి అప్పుడప్పుడు పూనకం లాంటిది వస్తూంటుందా ? పైగా ఇంత మందీ గూడ తమ పరిశ్రమలో అధిక భాగం ఖగోళశాస్త్రం (astronomy) మీద, దానికి అనుబంధమయిన గతిశాస్త్రం (kinematics) మీద ఎందుకు కేంద్రీకరించారు ?

ఈ ప్రశ్నలకు, భావవిప్లవాలే నిజమయిన విప్లవాలనే వాళ్ళు సమాధానం చెప్పలేరు. మార్క్సిజం చెప్పగలదు. ఏదయితే పాశ్చాత్య చరిత్రలో పునరుజ్జీవనం (renaissance) గా పరిగణించబడుతుందో అది పెట్టుబడిదారీ సమాజ ఆవిర్భావ దశ. పెట్టుబడిదారీ సమాజం పుట్టడానికి అత్యవసరమయిన షరతులలో ఒకటి, వాణిజ్య వర్గాల చేతులలో పెట్టుబడి కేంద్రీకరించబడడం. ఈ పెట్టుబడి ప్రాథమిక సమీకరణకు (primitive accumulation) తోడ్పడింది, మధ్యయుగాల చివరి భాగంలో విస్తరించిన అంతర్జాతీయ వ్యాపారం, లూటీ (trade and plunder), అమెరికాలో కొత్తగా బయల్పడ్డ బంగారు గనులు. ఈ వ్యాపారానికీ లూటీకి బంగారుగనుల నుండి బంగారాన్ని సరఫరా చేయడానికి నౌకాయానం అత్యవసరమయింది. ఆనాటి నౌకాయానంఖగోళ శాస్త్ర పరిజ్ఞానం మీద ఆధారపడింది. అందుకే ఈ 'పునరుజ్జీవనపు' తొలి వైజ్ఞానికులంతా ఖగోళ శాస్త్రానికి ఇచ్చిన ప్రాధాన్యత మరిదేనికీ ఇవ్వలేదు. నౌకకుటుంబానికి సంబంధించి కొంత పరిజ్ఞానం సంపాదించు

కున్న తరువాత గ్రహాల ధర్మాలను వివరించడానికి గతిశాస్త్రం పుట్టింది. 17, 18 శతాబ్దాలలో భౌతికశాస్త్రం యావత్తూ ఖగోళ, గతి. శాస్త్రాల చుట్టూ పరిభ్రమించింది.

వెంకటాద్రి చెప్పే 'భావవిప్లవాలు' ఎప్పుడూ తమ ప్రేరణను భౌతిక ప్రపంచం నుండే పొందాయి. అయితే ఆ ప్రేరణకు స్పందించి వివేచన ఆరంభమయిన తరువాత దానికి కొంతస్వయం చోదన(auto-dynamism)ఉంటుంది. అది నిర్దేశించే మార్గంలో ప్రయాణం చేస్తూ, మళ్ళీ మళ్ళీ భౌతిక వాస్తవాన్ని స్పృశించి ప్రాణం పోసుకుంటూ ముందుకు పోతుంది విజ్ఞాన శాస్త్రం. ఖగోళశాస్త్ర పరిశోధనకు అవశ్యమయిన దూరదర్శినికీ (telescope) క్రిమి శాస్త్రానికి (bacteriology) పునాది వేసిన సూక్ష్మదర్శినికీ (microscope) నిర్మాణంలో పెద్దగా తేడాలేదు. మొదటిది పుట్టిన కొద్ది కాలానికే — ఏ భౌతిక ప్రేరణా లేకుండా — రెండవదాన్ని Leeuwenhock నిర్మించాడు. అయితే క్రిమిశాస్త్రం అభివృద్ధి చెంది అధునిక వైద్యశాస్త్రాన్ని అవిష్కరించడానికి మాత్రం భౌతిక ప్రేరణకోసం కాచుకోవలసి వచ్చింది. ద్రాక్ష నుండి సారాయి (wine) ఉత్పత్తి చేసే వ్యాపారస్తులు fermentation (పులియబెట్టడం) సరిగ్గా జరగక పోవడానికి కారణమేమిటో పరిశోధించమని లూయీ పాశ్చర్‌ను అడిగినప్పుడు ఆయన చేపట్టిన పరిశోధనలతో క్రిమిశాస్త్రం అవిష్కరించబడింది.

అంతేకాదు కోశాంబి ఒక సందర్భంలో అన్నట్లు[3], పాశ్చాత్య పునరుజ్జీవనపు తొలి వైజ్ఞానికులలో అధికులు ఇంగ్లండ్, ఫ్రాన్స్, దేశాలకు చెందినవారు. ఆ రెండు దేశాలతోనే పెట్టుబడిదారీ సమాజం మొట్టమొదట అభివృద్ధి చెందింది. జర్మనీలో మొదటి గొప్ప శాస్త్రజ్ఞుడు (గణిత శాస్త్రజ్ఞుడు Gauss) 19 వ శతాబ్దం వరకు పుట్టలేదు. అక్కడ పుట్టుబడిదారీ విప్లవం గూడ (బిస్మార్క్ నాయకత్వాన) 1870 లోనే జరిగిందని చెప్పవచ్చు. ఈ విషయాలనన్నింటికీ 'భావవిప్లవాలే నిజమయిన విప్లవా'లని నమ్మేవాళ్ళు వివరణ ఇవ్వగలిగిన నాడు వాళ్ళను కనీసం సీరియస్‌గా తీసుకోవచ్చు.

సిద్ధాంత హర్మ్యాలు నిర్మించడానికి (systembuilding) తగు మాత్రం అజ్ఞానం వుంటే చాలునని బర్ట్రాండ్ రస్సెల్ ఒకసారి అన్నారు. ఆ మాట రస్సెల్ మార్క్స్‌ను ఉద్దేశించి వెటకారంగా అన్నదే అయినా, అది నిజానికి

—కొరవ 16వ పేజీలో

ఇప్పుడు ఊరు పోలీసు క్యాంపయ్యింది. ఊళ్లో జనం పారిపోయారు.... నిర్మానుష్యమైన ఆఊళ్లో దొర కొలువుదీరున్నాడు.... ఎటూ పోలేని నిర్భాగ్యులు గుడిసెలమీద రోజు దాడి-ఒక ఇంటికీ ఇంకో ఇంటికీ సంబంధాలు తెగిపోయాయి. హరిజన వాడమార్గం సంగతటుంచి ఊరికున్న అన్నిమార్గాలు బందుచేశారు....

ఏమార్గంలేకుండా చేసినదొర - దొరల ప్రభుత్వం ప్రజల ఆలోచనల మీద నిఘా వేయలేదు ... మార్గాలు తెరుచుకునే మార్గంగురించి వాళ్ళు ఆలోచిస్తున్నారు .... అదే విముక్తిమార్గం .... అప్పుడు దొరల - వాళ్ళ కొమ్ముకాసిన ప్రభుత్వ భటుల అమానుషమైన దోపిడి మార్గాలను శాశ్వతంగా మూసి వేస్తారు ....

రామయ్య పల్లెజనం గెలుస్తారు.....

(ఒక కరపత్రం ఆధారంగా ...)

---

—12వ పేజీ తరువాయి

మార్క్స్ విమర్శకులకు చక్కగా వర్తిస్తుంది. చరిత్రగురించి లోతయిన పరిజ్ఞానం లేని వాళ్ళే మార్క్స్‌ను విమర్శించడానికి ఉత్సాహంతో ముందుకు వస్తారు దుర దృష్టవశాత్తూ తెలుగుదేశంలో అజ్ఞానం పుష్కలంగా వున్న కారణాన, ఇలాంటి విమర్శకులూ వారి విమర్శకు శ్రోతలూ వాడవాడకూ వెలుస్తున్నారు.

Notes :-

1) మార్క్స్ రాసిన 'A contribution to the critique of political economy' అనే రచనకు ఎంగెల్స్ చేసిన సమీక్ష చూడవచ్చు. Progress publishers, Moscow, వారు ఆ సమీక్షను పుస్తకానికి అనుబంధంగా ప్రచురించారు.

2) Paul Baran, The political economy of growth, Penguin Books p. 270.

3) 1952 లో D. D. Kosambi రాసిన Science and Freedom అనే వ్యాసం చూడవచ్చు. 1957 లో ప్రకటించిన Exasperating Essays అనే సంకలనంలో ఆ వ్యాసాన్ని పునర్ముద్రించారు. పేజీ 50,